
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





## - 197-

## అమెరి'కమల వికాసం'లో ట్రంప్ కార్డ్ కథ

**మా చిన్నప్పుడు** మా ఇంటి వెనకాల తాళ్ళూరి వారి ఇంట్లో మా అమ్మా, తాళ్ళూరి బామ్మ గారూ, పక్కింటి భాస్కరం పిన్నీ...ఇలా మా గాంధీ నగరంలో ఉండే మహిళామణులు చాలా మంది మగాళ్ళు ఆఫీసులకి వెళ్ళాక, మధ్యాహ్నం తమ భోజనాలు అయ్యాక వీధి వరండాలో అడ్డాట, ఇస్పేటు మదాం లాంటి పేకాటలు ఆడుకునే వారు. అన్ని పేకాటల లోనూ ఉండే ముఖ్యమైన కార్డ్ ట్రంప్ కార్డ్. అడ్డాటలో ట్రంప్ కార్డ్ మనకి వచ్చిందీ అంటే పండగే. దాన్ని అటు ఆసు, రాజు, రాణీ నుంచి రెండో అంకె కార్డ్ దాకా మన ఇష్టం వచ్చిన పేకముక్కలా వాడుకునే వెసులుబాటు ఉంటుంది కాబట్టి మొహం వికసించేది. కానీ అదే కనక ఇస్పేటు మదాం ఆటలో వస్తే దానికి ఏకంగా పది నెగెటివ్ ఓకులు...ఈ నాటి తెలుగులో అయితే పాయింట్లు... ఉంటాయి, ఓకులు ఎక్కువ పడితే మనం ఆట ఓడిపోతాం కాబట్టి జోకర్ కార్డ్ పడగానే ఏడుపు మొహం ఆటోమేటిక్ గా పెట్టేశే వారు. ఇప్పుడు మా అమెరికా ఎన్నికల ఆటలో ట్రంప్ గారిది అదే పరిస్థితి. ఒక ఆటలో ఆయన ఓటు వేసే మనిషి అయితే మరొక ఆటలో ఓకులు పెంచే వ్యతిరేకి. వయసు రీత్యా నిజానికి ఈ నాటి సమాజానికి ట్రంప్ గారు ఏదో ఊడ పొడిచేటంత రిలవెంటా అంటే అదీ కాదు. వయసులో ట్రంపూ, నేనూ, బైడెన్ కంటే రెండేళ్లు మాత్రమే చిన్నవాళ్ళం కాబట్టి బైడెన్ లాగా మేమూ వారసులకి ఆస్తిపాస్తులు ఇవ్వడానికే తప్ప సమాజానికి అంత అవసరం లేదు. మా ట్రంప్ కి మైక్ ఇస్తే చాలు. ఎప్పుడు నిజం చెప్తున్నాడో, ఎప్పుడు బుకాయిస్తున్నాడో ఆయనకే తెలీదు. అయినా ట్రంప్ విషయంలో విచిత్రం ఏమిటంటే... "మగ" వాళ్ళకి ...అంటే MAGA గుంపుకి (Make America Great Again) ఆయనంటే వీరాభిమానం. మన వాళ్ళలో స్వామీజీలనీ, బాబాలనీ గుడ్డిగా ఆరాధించే తరహాలో వేలాది మంది 'భక్తులు" ట్రంప్ మాయలో పడి ఆరాధిస్తారు. డెమొక్రాట్స్ కి ట్రంప్ అంటే హిట్లర్ లాంటి నియంత, అమెరికా పరువు మంట కలిపేసే స్వార్థ పరుడు అనే ప్రగాఢమైన దురభిప్రాయం ఉంది. ఇక "గోపీ"లు. అనగా 'గోడ మీద పిల్లి' వోటర్లు. వీళ్ళని స్వింగ్ వోటర్లు అనీ, ఆయా రాష్ట్రాలని స్వింగ్ రాష్ట్రాలు అనీ అంటారు. ఏ పార్టీ కండువా కప్పుకోని వీళ్ళు ఎవరికి వోటు వేస్తే వారు నెగ్గుతారు. తను ఓడిపోవడం తథ్యము సుమతీ అని తెలిసి బైడెన్ పోటీ నుంచి విరమించుకోగానే

క్షణాలలో మన నల్లమల అడవుల్లో చిరుత పులి లాగా విజృంభించి, అతి కొద్ది రోజుల్లోనే డెమొక్రాటిక్ పార్టీ పగ్గాలు చేజిక్కుంచుకుని ట్రంప్ కి పోటీగా నిలబడుతున్న వీరనారి మన కమలమ్మ. గత నాలుగేళ్ళగా అమెరికా ఉపాధ్యక్షురాలిగా ఉన్న ఈ కమలా హేరిస్ పెద్దగా చెడ్డ పేరు తెచ్చుకో లేదు. అలా అని గొప్ప నాయకురాలిగా మంచి పేరూ తెచ్చుకో లేదు. మొత్తానికి ఇప్పుడు పోటీ కమల హేరిస్, డానల్డ్ ట్రంప్ ల మధ్య ఖరారు అయింది. స్థూలంగా చెప్పాలంటే డెమొక్రాట్లూ, రిపబ్లికన్లూ పార్టీల వారిగా వేసే ఓట్లు చెరి సమానంగా ఉంటాయి. కాబట్టి స్వింగ్ రాష్ట్రాలు అయిన జార్జియా, నెవాడా, విస్కాన్సిన్, మిచిగన్, పెన్సిల్వేనియా, అరిజోనాలు ఏ పార్టీని గెలిపిస్తే ఆ పార్టీ అభర్థి అమెరికా అధ్యక్షులు అవుతారు.

మన పవిత్ర భారత దేశానికి సంబంధించినంత వరకూ, నా దృష్టిలో కమల, ట్రంప్ లలో ఎవరు గెలిచినా దొందూ దొందే. అక్కడా, ఇక్కడా భారతీయులకి పెద్దగా ఒరిగేదేమీ లేదు. కమల పేరుకి మాత్రమే భారతీయ సంతతి. తన రాజకీయ ఉనికి ప్రధాన కారణంగా నల్ల జాతిలో మమైకం చెందిన కమల తన తల్లి శ్యామల ఇండియా నుంచి వలస వచ్చింది అని మాత్రమే అవసరార్ధం ప్రస్తావిస్తుంది. ఆఖరికి తను రచించిన "The Truths We Hold"– An American Journey అనే ఆత్మ కథలో అయినా తన తల్లి తమిళనాడు లోని తులసేంద్రపురానికి చెందిన బ్రాహ్మణ మహిళ అని కానీ, చిన్నప్పుడు మద్రాసు వెళ్ళి తన తాత గారైన పి.వి గోపాలన్ గారితో గడిపిన సాంగత్యం గురించి కానీ ప్రస్తావించనే లేదు అని నేను ఎక్కడో చదివాను. ఇక ట్రంప్ గారి ఉపన్యాసాల తీరు భారత దేశంలో రాజకీయ నాయకుల దుర్భాషలని గుర్తుకు తెస్తాయి. ప్రత్యర్థులని మన నాయకులు నక్కా, కుక్కా, దగుల్బాజీ, దొం.ముం.కొ అంటూ అడ్డమైన తిట్లు తిడుతున్నట్లే ట్రంప్ గారు కమలమ్మని 'బుర్ర తక్కువ, అబద్ధాల కోరు, ఊసరవెల్లి, గుర్రం మొహం లాంటి వెటకారాలతో తన "మగ" ..అదే MAGA భక్తులని మురిపిస్తాడు. పైగా కమలమ్మది వెకిలి నవ్వు అని వెటకారం చేసే ట్రంప్ గారు మటుకు ఆ మాత్రం నవ్వడం కూడా చాలా అరుదు. ఇక ట్రంప్ గారు ఉపాధ్యక్ష పదవికి ఎంపిక చేసుకున్న జె.డి. వాన్స్ ఆంధ్రా అల్లుడు అవడం మన భారతీయులకి, ముఖ్యంగా తెలుగు వారికి కేవలం ఆసక్తికరమైన విషయం మాత్రమే. అతని భార్య మన తెలుగమ్మాయి ఉష చిలుకూరి తన తల్లిదండ్రులు భారత దేశం నుంచి వచ్చారు అని కమల లాగా కాలిఫోర్నియాలోనే పుట్టిన ఆ అమ్మాయి కాస్త గర్వంగానే చెప్పుకుంటుంది. వాళ్ళ పీటల మీద పెళ్ళి కూడా మన పద్ధతిలోనే జరిగింది. అయినప్పటికీ ఈ ఆంధ్రా అల్లుడు జె.డి వాన్స్ అమెరికా ఉపాధ్యక్ష్యుడుగా నెగ్గినంత మాత్రాన ఉషమ్మ భర్తగా మనకి గర్వకారణమే కానీ అత్యాశలు భారత్ కి ఉపయోగపడతాడు అని ఆశలు పెట్టుకోకూడదు. ఎంతయినా అల్లుడు దశమ గ్రహమే కదా!.

ఈ సోది అంతా ఎందుకు కానీ, రాజకీయాలని గమనించడమే కానీ పట్టించుకోని ఒక సాధారణ అమెరికా వలస పౌరుడిగా నా వోటు ఎవరికి వెయ్యాలా, అసలు సిసలు అమెరికన్ వాళ్ళు ఎలా ఆలోచిస్తారా అని ఆలోచించగా ఈ సారి అమెరికా ఎన్నికలలో ముఖ్యమైన అంశం ద్రవ్యోల్బణం అనగానిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడం అని అర్థం

అయింది. ఉదాహరణకి గత 2016–2020 ట్రంప్ పరిపాలనలో సుమారు 2 కేజీల బరువు ఉన్న సంచీ కంది పప్పు $1.99 ఉండేది. ఆ రోజుల్లో అమెరికా – ఇండియా మొత్తం కొనుగోళ్లు అంటే గోంగూర పచ్చడీ, ఆవకాయ, పప్పూ, బియ్యం లాంటి ఆహార పదార్ధాలు, చీరలు, లాల్చీలు, కుర్తాలు, కంప్యూటర్ యువతీయువకులు, వాళ్ళ కి ఇచ్చుపుచ్చుకునే జీతాలు, ఓడలు, విమానాలు, ఆయుధాలు, మందులు, స్వామీజీలు మొదలైన మొత్తం ఎగుమతులు, దిగుమతులు లెక్కల ప్రకారం, అమెరికాకి నికరంగా ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువ ఉండేది...అనగా ట్రేడ్ సర్ ప్లస్ మోడీకే ఉండేది. దాంతో ట్రంప్ కి ఒళ్ళు మండి ఇండియా దిగుమతుల మీద టారిఫ్ పెంచి పారేశాడు. ఆ మర్నాడే కంది పప్పు ధర $3.99 కి పెరిగి పోయి మా ఇంటి పక్క పటేల్ బ్రదర్స్ కిరాణా కొట్టు వాడి లాభాలు పెరిగి పోయాయి. 2020 లో ట్రంప్ ఓడిపోయి బైడెన్ వచ్చినా, ఆ టారిఫ్ పెంపుదల అలాగే ఉండిపోవడమే కాక ఆ దిక్కుమాలిన కోవిడ్ మూలాన అదే కంది పప్పు సంచీ మళ్ళీ పొలోమని $5.99 కి పెరిగి పోయింది. ఇక బైడెన్–కమలమ్మ హయాం లో నిన్నటికి నిన్న అదే కంది పప్పు సంచీ $9.99 అని చూసి ఇక వంటింట్లో మన పప్పులు ఉడకాలంటే ఆ ఇద్దరిలో కంది పప్పు, మినప్పప్పు ధరలు ఎవరు తగ్గించ గలరో వారికే నా వోటు అనేసుకుని 'ట్రంప్ కే" అని క్వీన్ విక్టోరియాకి చెప్పగానే....ఆ ముద్దపప్పు ట్రంప్ కేం తెలుసు కంది పప్పు గురించి, సాంబార్ రాణి కమల కే నా వోటు" అని ఆవిడ నన్ను చెడామడా తిట్టేసి మా ఇంటి వోట్లు చీల్చేసింది. మామాట ఎలా ఉన్నా, అమెరికన్లకి కావల్సిన ఈ ఎకానమీ, ధరల పెరుగుదల అనే అంశం మీద గాలి ట్రంప్ కేసే వీస్తోంది.

ఇక రెండో అంశం ఆదాయం పన్ను విషయం లో ఎవరు ఎవరిని ఎక్కువ బాదెదరు, అందులో మనం ఎక్కడ ఇరుక్కుంటాం అనేదే అమెరికన్లకి ముఖ్యమైన విషయం. వ్యాపార సంస్థలు, బిలియనీర్ల మీద పన్ను తగ్గిస్తే వాళ్ళు ఆ డబ్బుని మళ్ళీ వ్యాపారం లోనే పెట్టి, ఉద్యోగాలు పెంచి మొత్తం ఆర్ధిక వ్యవస్థని మెరుగు పరిచి అందరి జీతాలూ పెంచుతారు. ఇది వరకూ నేను ఆ పని చేసి చూపించాను కదా అని ట్రంప్ వాదన. పైగా ఈ సారి రెస్టారెంట్లలోనూ, బార్బర్ షాపుల్లోనూ ఇతరత్రా పని చేసే వాళ్ళ టిప్స్ మీద టాక్స్ వెయ్యను సుమా అని ట్రంప్ కొత్త హామీ ఇస్తున్నాడు. పాపం కమలమ్మ ఆ ఐడియా కాపీ కొట్టడమే కాక పసిపాపలు ఉన్నవాళ్ళకి ఆరు వేలు పన్ను రాయితీ, కొత్తగా ఇల్లు కొనుక్కునేవాళ్లకి పాతిక వేలు మినహాయింపు మొదలైన సంక్షేమ పథకాలు ప్రకటించింది. అవతల వేపు జె.డి. వాన్స్ గారు తెలిసో తెలియకో పిల్లలు ఉన్న వాళ్ళకి అదనంగా ఎక్కువ వోట్లు ఇవ్వాలి, పిల్లలు లేకుండా పిల్లి పిల్లలని పెంచుకునే వాళ్లకి బాధ్యతలు తెలియవు కదా అని ఎప్పుడో వాగిన వాగుడు ఇప్పుడు తలకి రోకలై చుట్టుకుంది. మరి కమలమ్మకేమో సొంత పిల్లలు లేరు. వీటన్నిటి వాదోపవాదాలూ ఎలా ఉన్నా, నా మటుకు నాకు ఇవేమీ అన్వయించవు. అనగా...నాకు 'ఇచ్చట అందముగా క్షవరము చేయబడును, ప్రొ. వీర్రాజు బార్బర్ షాప్ లో కానీ, "రాజుల భోజన హొటెల్, భోజనం తయార్" లో కానీ పని చేసే టిప్పుల సంపాదన లేదు. ఇక ఉన్న ఇల్లే అమ్మేసే పరిస్థితి కానీ కొత్తది కొనుక్కునే ఆలోచనే లేదు. పిల్లల

ఆయాల కోసం ఇచ్చే రాయితీ అంటారా...ఇప్పుడు మా పిల్లలకే పిల్లలు కానీ మాకు ఆ బాదరబందీ లేనే లేదు. మా ఇంట్లో కుక్క పిల్లలే కానీ, పిల్లి పిల్లలు లేవు. అంచేత ఎటు నుంచి ఎలా చూసినా ఎవరు నెగ్గినా మాకేమీ ఒరిగేది లేదు. ఈ విషయం లో మా క్వీన్ విక్టోరియా ట్రంప్ వేపు మొగ్గితే భార్యా విధేయుడిగా నేను కమలమ్మ కి నా వోటు వెయ్యాలి కదా!. అంటే మళ్ళీ మా ఇంటి వోట్లు చీలిపోయినట్టే. అంతే కాదు. మన ఇందిరమ్మ ఇళ్ళు పథకం లాగా కమలమ్మ ఇక్కడ బీద వారికి మూడు మిలియన్ల ఇళ్ళు కట్టి ఇస్తుందిట!. అటు ట్రంప్ కి ఫ్లొరిడాలో ఉన్న ఒక రిసార్ట్ ఇల్లు వంద మిలియన్లు ఖరీదు ట. మరి ఇలాంటి డొల్ల వాగ్దానాలకి అతను నవ్వుకోడూ?

ఇక అమెరికా ఎన్నికలని కుదిపేస్తున్న మరొక అంశం అబార్షన్ విషయం...ఎట్టి పరిస్థితి లోనూ అబార్షన్ చేయించుకునే హక్కు నూటికి నూరు పాళ్ళు మహిళలకే చెందుతుంది అని డెమొక్రాటిక్ పార్టీ కమలమ్మ గారి వాదన అయితే, ఇటీవలి సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం మాన భంగం, తల్లి ప్రాణాలకి అపాయం లాంటి అత్యవసర పరిస్థితులని బట్టి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం అబార్షన్ న్యాయ సూత్రాలని నిర్దేశించుకోవాలి అని ట్రంప్ గారి వాదన ఒక సారి అటూ, ఇంకో సారి ఇటూ మారుతూ ఉంటుంది. ఈ అంశం మీద కమలమ్మ ఖచ్చితంగా నెగ్గి తీరుతుంది.

అందరికీ సంబంధించిన ఆరోగ్యానికి చెందిన ముఖ్యమైన అంశాలు మెడికల్ ఇన్స్యూరెన్స్, సోషల్ సెక్యూరిటీ, మెడికేర్, మందుల ఖరీదులు మొదలైనవి. అందరికీ అందుబాటులో ఉండేలా మెడికల్ ఇన్స్యూరెన్స్ విధానాలని అప్పుడెప్పుడో డెమొక్రాట్లు మొదలు పెట్టి ప్రజలకి చాలా ఉపయోగపడుతున్న ఒబామా కేర్ ని కాదన లేక ఆ పథకాన్ని కొన సాగించక తప్పని ట్రంప్ కి దాన్ని పూర్తిగా కేన్సిల్ చేసి కొత్త పద్ధతులు ప్రతిపాదించడం ఇప్పటి దాకా సాధ్యపడ లేదు. ఈ హెల్త్ కేర్ విషయాలలో కూడా బహుశా కమలమ్మ కే విజయం వరిస్తుంది.

ఇక అన్నింటి కంటే ట్రంప్ గారి పెద్ద ట్రంప్ కార్డ్ మెక్సికో దేశ సరిహద్దులో గోడ నిర్మాణం, అక్రమ వలస దారుల నివారణ. గత తన పరిపాలనలో భారీ అడ్డుగోడ కట్టడం ప్రారంభించి, కఠినమైన నిబంధనలతో అక్రమ వలసదారులని అరికట్టడం లో ట్రంప్ సఫలీకృతుడయ్యాడు. కానీ, బహుశా అనాలోచితంగా పౌరుషానికి పోయి బైడెన్ తను నెగ్గగానే మెక్సికో బోర్డర్ కట్టడి విధానాలని ఎంతో సరళీకృతం చెయ్యడంతో వేల సంఖ్యలో ఉండే వలస దారులు గత మూడేళ్ళలో మిలియన్ల కొద్దీ అమెరికాలో అక్రమంగా ప్రవేశించారు. ఇదంతా కమలమ్మ స్వయంగా పెత్తనం వహించి, వలస వెల్లువని నియంత్రించ లేక ఇంచుమించు చేతులెత్తేసిన పరిస్థితి. ఈ ఇమ్మిగ్రేషన్ విషయాలలో ట్రంప్ గెలిచి తీరతాడు.

ఇక యుక్రైన్ –రష్యా, ఇజ్రాయెల్–హమాస్–హెజ్ బుల్లా యుద్ధాల వలన జరుగుతున్న దారుణ హింసా కాండలో అమెరికా నిస్సహాయత, చైనా, ఉత్తర కొరియా, ఇరాన్ మొదలైన దేశాలతో అమెరికా విబేధాలు, నాటోతో ఎంత వరకూ కలిసి మెలిసి ఉండగలం, పర్యావరణం, చమురు, సహజ వాయువుల స్వయం ప్రతిపత్తి, విద్యా విధానాలు మొదలైనవన్నీ అమెరికా విధి విధానాలకి సంబంధించిన కీలకమైన అంశాలు. ఈ విషయంలో తను చెప్పుకుంటున్నంత గొప్పగా కాక

పోయినా కమలమ్మ కన్నా బహుశా ట్రంప్ కి కాస్త ఎక్కువ స్పష్టత ఉంది, బహుశా కొంచెం మెరుగు అని కూడా అనుకోవచ్చును. పైగా ట్రంప్ లాంటి కరుడు కట్టిన వ్యాపారస్తుడి కన్నా కమలమ్మ తో లావాదేవీలు కాస్త సులభం అని విదేశీ నియంతలు, నాయకులు అనుకునే అవకాశం ఉంది. ఇప్పుడు జరుగుతున్న యుక్రైన్–రష్యా, ఇజ్రాయెల్–పాలస్తీన్ యుద్ధాలు జరుగుతున్నంత కాలం ట్రంప్ గెలిచే అవకాశాలే ఎక్కువ.

ఇక భారత దేశం సంగతికి వస్తే ముందే చెప్పినట్టు, ట్రంప్, కమలమ్మ దొందూ, దొందే! భారత దేశం టీవీలూ, పత్రికలూ, ప్రజలూ మనల్ని మనమే పొగిడేసుకుని, AI అంటే అమెరికా – ఇండియా అనీ, ఇద్దరి దేశాల మధ్య అనుబంధం, స్నేహం ప్రగాఢమైనవి అనుకుంటూ మనకి మనమే భుజాలు తడిమేసుకుని ఎప్పటిలాగానే మనం లేకపోతే అమెరికా పని ఉట్టిదే అని అనేసుకుంటాం కానీ అమెరికాలో సాధారణ పౌరుడికి కానీ, టీవీ వాళ్ళకి కానీ, ప్రభుత్వానికి కానీ ఇండియా విషయం లో ఉన్న ప్రాధాన్యత పై పై పూత మాత్రమే. అంతెందుకు...క్రిందటి వారం...అంటే సెప్టెంబర్ మూడో వారం లో మోడీ గారి అమెరికా పర్యటన గురించి నేను చూసిన ఏ ఒక్క అమెరికా టీవీ లోనూ...సి ఎన్.ఎన్, ఎం.ఎస్.ఎన్. బి.సి, ఫాక్స్, న్యూస్ మాక్స్, స్క్రిప్స్, ఎబిసి, సిబిఎస్, ఎన్ బిసి, పి,బి ఎస్....ఒక్కంటంటే ఒక్క టీవీలో మోడీ పర్యటన, QUAD శిఖరాగ్ర సమావేశం ప్రస్తావన లేనే లేదు. కానీ భారత దేశం లో ప్రసార మాధ్యమాలు అన్నీ ఏకగ్రీవంగా "మోడీకి అమెరికా ఘన స్వాగతం" అని పతాక శీర్షికలతో వార్తలు గుప్పించారు.

ఆఖరిగా..

ట్రంప్ నెగ్గితే ఇక అమెరికాలో ప్రజాస్వామ్యం పోయి నియంత పరిపాలన వచ్చినట్టే అని కమలమ్మతో సహా డెమొక్రాట్లు అందరూ ప్రచారం చేస్తున్నారు. మరీ అంత కాకపోయినా...ఇదేమీ కొట్టిపారెయ్య దగ్గ విషయం కాదు. మరీ ముఖ్యంగా ఇటీవల అమెరికా సుప్రీం కోర్టు "అధ్యక్ష పదవిలో ఉన్న వారి నిర్ణయాలు, చర్యలు ఇంచుమించు అన్నీ న్యాయపరంగా చట్టబద్ధమైనవే కాబట్టి అవన్నీ కోర్ట్ లో దావా వేసి చాలెంజ్ చెయ్యడానికి అతీతం." అనే తీర్పు ఇచ్చింది. అమెరికా అధ్యక్షుడి ఇంచుమించు అన్ని చర్యలూ చట్టానికి అతీతం అనేది నిజానికి అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య వ్యతిరేకమైన తీర్పు కానీ చాలా అస్పష్టత తో కూడుకున్న తీర్పు. అయినా ట్రంప్ కనక అధ్యక్షుడు అయితే ఈ తీర్పు ఆధారంగా ఖచ్చితంగా రెచ్చిపోతాడేమో కదా. అందువలన డెమొక్రాట్లు భయపడడం సహజమే. గత మూడు, నాలుగేళ్ళగా నిజానిజాలు ఎలా ఉన్నా, బైడెన్ ప్రభుత్వ హయాంలో ట్రంప్ వందల కొద్దీ కోర్ట్ కేసులు ఎదుర్కోవడం. ఒక కేసులో ఏకంగా 36 అంశాలలో ముద్దాయిగా నిర్ధయించబడడం, ఆయన ఇంకా తట్టుకుని నిలబడడం....రాజకీయాలని ఎక్కువ పట్టించుకోని సాధారణ అమెరికా పౌరుడు 'అయ్యో పాపం" అనుకోవచ్చు కదా!. అంచేత ఈ గో.పీ లు ఏమనుకుని ఎవరికి వోటు వేస్తారూ అనేదే ఈ నాటి యక్ష ప్రశ్న.

మొత్తానికి ద్రవ్యోల్బణం, పన్ను రాయితీలు, ఉద్యోగావకాశాలు, మెడికల్ ఇన్స్యూరెన్స్, సోషల్ సెక్యూరిటీ, అబార్షన్, అక్రమ వలస, జరుగుతున్న యుద్ధాల నేపథ్యం లో విదేశాంగ విధానాలు, అమెరికాలో ప్రజాస్వామ్యం మనుగడ మొదలైన అనేక అంశాల నేపథ్యం లో అత్యంత కీలకంగా జరగనున్న అమెరికా ఎన్నికలలో నా దృష్టిలో కమలమ్మ కి అత్యధిక మెజారిటే వోట్లు పడినా, అమెరికా రాజ్యాంగం ప్రకారం ఎలెక్టొరల్ వోట్ల లెక్కింపు ప్రకారం డానల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయే అవకాశాలు చాలానే ఉన్నాయి. కానీ. ఏమో గుర్రం ఎగరా వచ్చును?

**COMMENTS**